
# ఇగురం




మొగులు గుడ్డుగమ్ముకుంది.పొద్దంతా ముసురు. జల్లన కొట్టిపోతే కుండపోతకైనా ఓర్వచ్చు. గుడ్డిముసురుకు వశంగాదు. గొంగడి కప్పుకున్నట్టే గానీ చలితో వణుకుతున్నాడు బీరయ్య. చిల్లులు వడ్డ గొంగడి పడ్డ చినుకును పడ్డట్టుగానే పీల్చుకుని బీరయ్యను తడిపేసింది. దానికితోడు పొదల సందుల్లోంచి, చెట్ల కింద నుంచి, రాళ్ల తెట్టెలను దాటుకుంటూ కంపల్ని తప్పుకుంటూ అడివంతా కలియదిరుగుడు.

గొంగడి చాటుగానే వణుకుతున్నాడు బీరయ్య. ముసురు అతడి శరీరాన్నే వణికిస్తుంది కొమ్ములు తిరిగి గడ్డం పెరిగిన పోతుపిల్ల అతడి మనసును కూడా వణికిస్తుంది. మొత్తం మీద మందను కాస్తున్న బీరయ్య వణికిపోతున్నాడు. ఊరివైపు వెళ్లాలంటే భయంగా ఉంది.

అతడి భయంతో పని లేకుండా చీకటి ముసురుకుంటుంది. చెట్ల చాటుకున్న మేకల్ని, గొ(ర్రెల్ని గుంపుగా చేశాడు. ఎప్పుడూ కాలు నిలువని సుక్క మేక ఒకటి గుంపును దాటి రాళ్ల తెట్టె ఎక్కింది. క్షణంలో అటువైపు దూకి చిక్కుడు తోట్లోకి పరుగు తీసేదే!

'గెగ్గే... నీ గత్తర్రాను. గా తొ(ర్రలేముందని పోతున్నవు. నిన్ను దొంగలుదిన...' విసుగ్గా చేతిల కట్టెను విసిరాడు. ఎంత కోపమచ్చినా సూటిగా విసరడు. అలికిడి కొరకు పక్కకు విసురుడే. కట్టె మూడు చుట్లు తిరిగి పొదలోకి దూసుకుపోయింది. బలబల చప్పుడుకు మేకపిల్ల ఇటువైపు దూకి మందలో కలిసిపోయింది.

టేకుటాకుల మీద వాన చినుకులు టపటప

మంటున్నాయి. బురదలో నానిన కాళ్లు పెచ్చి దురద పెడుతున్నాయి. ముసురుకు అడివంతా బురదనే. పరికి పొదలోని కట్టెను అందుకుని మేకల మందను పెద్ద తొవ్వ వైపు మళ్లించాడు బీరయ్య. గొర్లు, మేకలు గుంపుగా పెద్ద తొవ్వనెక్కి ఊరివైపు మరిలాయి. ఊరివైపు అడుగులేస్తుంటే గుండె దడదడలాడింది బీరయ్యకు. ఆ రాత్రి అక్కడే ఉన్నా బాగుండు అనిపించింది. 'యాడున్నా ఇడిసిపెడుతారు. వంతు వంతేనంటరు' అనుకున్నాడు.

మేకలు, గొర్లు కలెగలిపి నూటికి పైగా జీవాలు. తోసుకుంటూ తొక్కుకుంటూ తొవ్వ నిండుగా ముందుకు నడుస్తున్నాయి. గొంగడి కొప్పెరను నిండుగా కప్పుకుని కండ్లు మాత్రమే బయటపెట్టి రెండు కాళ్ళమీద నడుస్తున్న గొర్రెలా అడుగులేస్తున్నాడు బీరయ్య. అడుగులేస్తూనే మందను కలేచూస్తున్నాడు. మేకలు ముందు వరుసలో ఉన్నాయి. గొర్లు కొన్ని ముందు మరికొన్ని వెనుక ఉన్నాయి. ఇప్పుడిప్పుడే మేతకచ్చిన పిల్లలు తొక్కుట్లో నలిగిపోతున్నాయి.

"ఒర్నీయక్క... తొక్కి సంపెటట్టున్నయి. ఈటికి కండ్లే కనవడుతలెవ్వు" అంటూ నాలుగు అడుగుల్లో ముందుకచ్చి పిల్లల్ని వేరు చేశాడు. తప్పించుకున్న మర్క పిల్లల్ని వెనుక కాళ్లు పట్టి గుంజి మందను గెదిమాడు. జీవాలన్నీ చెల్లా చెదురై చెట్ల సందుల్లోకి ఉరికి మళ్లీ గుంపుగూడి ముందుకు సాగాయి.

మంద తావునుండే గూడ్కల పిల్లలు, ముర్రు పిల్లలు గాక ఏడెనిమిదున్నాయి మర్క పిల్లలు. మంద వెనుకగా నడుస్తున్నాయి. రెండు గుంపులకు మధ్య బీరయ్య నడుస్తున్నాడు. నడుస్తూ నడుస్తూనే చూపులతో మరోసారి మందను తడిమాడు. కంటిచూపులోంచి ఒక్కొక్క జీవమూ మారుతుంది. ఏ ఒక్కటి తప్పిపోయినా అప్పుడే వెతుక్కోవాలె. లేదంటే ఏ జీవరాశి నోటిలోనో పడుతుంది.

కొదుమ, సుక్క కొదుమ, బొల్లి మర్క, పోరిమ్యాక, కట్టుమర్క, బొల్లిమ్యాక, సుక్కపోతు, సారది, ఆడి గొర్రె, గొడ్డు గొర్రె, గొడ్డు మ్యాక, పొడేలు పిల్ల, బోడపోతు, ఊబపోతు, నల్లమ్యాక, తెల్లది... అరే... గడ్డంపోతులేదు! చూపులు మందనంతా కలియదిరిగినాయి. ఒక్కసారిగా గుండె జల్లుమంది.

నడీమందలో అన్నింటికంటే ఎత్తుగా, బలంగా, రింగులు దిరిగిన కొమ్ములతో, గడ్డంతో మందకు తానే పెద్ద అన్నట్టుగా నడుస్తుంది గడ్డంపోతు. అప్పుడప్పుడు బ్బె....బ్బె...బ్బే... అంటూ కొదుమలను, పోరిమ్యాకలను తరుముతుంది. మే....ఏ.... అని ఎదునకచ్చిన మేకలకు ఏదో సైగను పంపుతుంది. మాయమయిందనుకున్న మేక మందలో కనిపించినా మరోసారి గుండె జల్లుమంది బీరయ్యకు. ముసురు ముసురుగానే ఉంది. చీకట్లు ముసురుకుంటూనే ఉన్నాయి. బీరయ్య మాత్రం తల్లడమల్లడమయితుండు.

"వాళ్లదేంబోతుంది... అంశినదానిమీద అయ్యారోడు చేయ్యేసిండట. ఉత్తగనే వచ్చేదిగదాని ఇది గావాలే. అది గావాలె అంటరు. ఈ ఎట్టిపిల్ల ఎట్ల పుట్టిందోగనీ యాడాది యాడాది గొల్లోల్లకు ఇదో తాకులాట. వంతులనీ.... శాతలనీ ఇండ్ల దిండ్లనే కొట్లాడుతరుగనీ ఎవ్వడు ముందుకువడి ఇదేంటిదని అడుగడు. ఎవలు పుట్టినగడి.... ఎవలు పెరిగినగడి.... ఎవనికి నీడనిచ్చింది.... ఎవడు బతికిండు... దానిముందు యాటను కొట్టుడెందుకు? గొల్లోల్లను ఎట్టివట్టుడెందుకు? ఒర్నీయక్క..... వాడచ్చి గడ్డంపోతే గావాలంటడు. ఏం లేదన్నా మూడు నాలుగు వెయిలమాలు. తినక తాగక

మూతినోరు గట్టుకుని వాళ్ల బొందల మీద పెట్టుడు. ఈ దసుర పండుగ గొల్లోల్ల గండానికి వచ్చినట్టుంది..''

''బీరయ్య మామా... పక్కకు జరుగు. ఒర్నీయక్క.. చెవులు ఇనత్తలెవ్వేందే... ఒర్రినా సప్పుడు జేత్తలెవ్వు...'' వెనుక నుండి పిలుపుకు తేరుకుని తిరిగి చూశాడు బీరయ్య.

మేకల మందతో దగ్గరిదాకా వచ్చాడు మల్లయ్య. ''ఏందిరా.... ఆగమాగం గెదుముకత్తున్నవు'' అంటూ ముందుకురికి తన మందను నిలిపి పక్కకు జరిపాడు.

''ఏం జెయ్యాలెనే సూడుసుడుమంట ఈ ముసుర్లనే మూడు మ్యాకలు ఈనినయి. ముర్రు పిల్లల్ని గొంగట్లేసుకున్న. ఎంతగనమని మొయ్యాలె. అందుకనే దబదబ బోతున్న'' అంటూ పక్కనుంచి మందను తోలుకుని ముందుకు నడిచాడు. నడుస్తూ నడుస్తూనే గడ్డంపోతుని ఇరుగజూశాడు.

ఒక కంట ఇది గమనిస్తూనే ఉన్నాడు బీరయ్య. కోపంతో పండ్లు కొరికాడు. 'ఇసొంటోళ్ళు చెప్పితేనే వాళ్లు ఉషారయింద్రు. లేకుంటే ఎన్నడో నాలుగేండ్ల కిందనే మరిచిపోయిన ఎట్టి పిల్లను మల్లా తేడికదీసి యాదిజేసుడేంది?' అనుకున్నాడు. పైకి మాత్రం ఒక మాట తలిగెయ్యాలని ''ఏందిరా అల్లుడా....! గడ్డంపోతును ఇరుగజూడవడితివి'' అన్నాడు.

ఆ మాటలకు చూపులు తిప్పుకున్నాడు గానీ మారుమాట చెప్పలేదు మల్లయ్య. వినపడనట్టే ముందుకు నడిచాడు. మందకు మందకు మధ్య మనిషి. మందలు సాగిపోతూనే ఉన్నాయి. జోరు తగ్గినా ముసురు మాత్రం ఎలువలేదు. తప్పుకుని ఒక మందలో కలిసిన ఇంకొకరి మేకలు ఉరుకులతో పరుగులతో స్వంత మందలకు చేరుతున్నాయి. అది చూసినంక మల్లయ్య వైపు తిరిగి చూసి..

''వీనికంటే ఈ జీవాలే నయం. ఏ మందల జీవాలు అదే మందలకు చేరుతాయి. వీడు మాత్రం ఎప్పుడూ ఆ రైతుల ఎంబటే ఉంటాడు. కులకషిపి మరుగులన్నీ చెబుతాడు. లగ్గాలు మూర్తాలప్పుడు గొర్రె మేకల జాడా ధర ముందే చెబుతాడు. నా పోతుపిల్ల సంగతి కూడా వీడే చెప్పినట్టున్నాడు. లేకుంటే వాళ్లకేం తెలుసు...'' అనుకున్నాడు బీరయ్య. ఆ మాటలు కోపంలో బయటకు కూడా వినిపించాయి.

పదనదేరిన ఇసుకలో కూరుకుపోయిన డెక్కల చప్పుళ్లు చేసే స్థాయిని దాటి మల్లయ్యను చేరుకున్నాయా మాటలు. అతడికి గొంగడి కొప్పెరలేదు. గంద్ర పేగును నెత్తికి కట్టుకున్నాడు.

''ఏంది మామా... ఏదో గులుగుతున్నవూ...?'' అన్నాడు కాలును కాసేపు ఆపి.

''ఎట్టి పిల్లనటరా... ఎట్టిపిల్ల. ఈసారి నా వంతట. గడ్డంపోతు ఉన్నదని ఎవలో చెప్పింద్రట. కొత్త కారోబారు సర్పంచ్ పిలిపిచ్చి అడిగింద్రు. నీయక్క నేను ఈడ్చి ఇరువై దిట్టిన. అయినా గదే పాటపాడుతరు. నా దగ్గర పోతున్నదని చెప్పినోడెవడోగానీ.... నీయక్క నాకు దొరికితెనా... అన్క జబ్బల గుద్దుదుంటి గనీ ఏమక్కరె....' అన్నాడు. చెప్పింది నువ్వేరా అన్నట్టుగా. అతడు తననే అంటున్నాడని మల్లయ్యకు కూడా అర్థమైంది.

''గగ్యా... నిన్ను దొంగలు వొడువ. ఏందే గటు వోతున్నవు. మబ్బచ్చినాదే... నరుకుత బిడ్డా... నీ కావురందీత్త...' మ్యాకను తిడుతున్నట్టుగా గట్టిగా అన్నాడు మల్లయ్య. అది తననే అని బీరయ్య కూడా అర్థం చేసుకున్నాడు.

ఎవలేమన్నా ఎదిరిచ్చి అనలేక మేకల మీద పెట్టి అనడం అలవాటయిపోయింది. అందుకే

అదో పెద్ద విషయంలా తోచలేదు ఇద్దరికి. మళ్లీ బీరయ్యనే చెప్పుకున్నాడు.

"ఈ నాలుగైదేండ్లు ఎవలూ పిల్లమాట ఎత్తలేదు. సచ్చుకుంట గుమ్మడికాయను కచీరు కాడా గడికాడ కొట్టుకున్నరు. మల్లేం యాదికొచ్చిందో.. గొల్లోల్లు ఎట్ల బతకవట్టిరని పిల్ల పాటను మల్లా ఎత్తుకున్నరు. మునుపన్నా ఏది ఇస్తే అదే తీసుకుందురు. ఇప్పుడు అట్లగాదట. ఏరుకున్న పిల్లనట. దిగవడ్డరు దిడ్డీల మీదికెల్లి అని రాంగనే పీకి చేతుల వెడుతరట." కడకుమీద మాట్లాడాలనే అలా అంటున్నాడు మల్లయ్యతో. కానీ లోలోపల భయంగానే ఉంది.

చలికి వణుకుతున్నాడు మల్లయ్య. అప్పుడప్పుడు గంగ్రపేగును వడివెట్టి పిండుతున్నాడు. పిండి మొహం మీదున్న చినుకులను తుడుచుకుంటున్నాడు. చేతుల కట్టె పట్టుకుని గొంగడి ముల్లెలో గొర్రెపిల్లల్ని భుజానవేసుకుని ముడుచుకుని నడుస్తూ.. "మిండెలు మామా... మిండెలు. అప్పుడు ఊర్లు తిరిగిండ్రు. ఎట్టిపిల్లను ఎవడడిగినా నరుకుతమని చెప్పిండ్రు. ఎవ్వడన్నా నోరు దెరిత్తేనా.. ఇప్పుడు లేచినోడు లెవ్వనోడు అందరు పెద్దమనుషులే! ఐదేండ్ల కింద మేము ఇయ్యలేదా....? ఆ కాలంల వెయ్యి రూపాయల పిల్ల" అన్నాడు.

"బందయింది బందే ఉండాలె. మల్లా వాల్లు అడుగుడేందీ మనమిచ్చుడేందిరా... ఒర్నీయక్క దర్మానికి దండుగు లేదట. ఎట్టికి సుఖం లేదట. ఇప్పుడు ఎట్టి పిల్లేందిరా..." అతడు కొద్దిగా దూరం అవడంతో లగాయించి అన్నాడు బీరయ్య. అలా అనగానే ఇలా బందయితదని కాదు గానీ ఏదో మార్గం చూడాలన్నట్టుగా అన్నాడు.

"ఆ.. నీకు ఇయ్యల్ల కడుపునొత్తంది. అందర్నీ ఓమ బుక్కుమంటే ఎందుకు బుక్కుతరు. ఎవడికి నొత్తే వాడె బుక్కాలె. అయిదేండ్ల కిందనే మా నాయినా అందరం కూడబలుక్కోవాలన్నడు. ఒర్నీయక్క పొద్దుగూకి అందరు చెవులూపిండ్రట. తెల్లారి ఎవ్వడు పత్తలేడట. ఇచ్చినోల్లందరు మేమిచ్చినంగనీ వానికెందుకు మాఫీగావాలన్న బాధనాయె... "అంటూ కదిలిపోయాడు. జీవాలు నేల చూపులు చూస్తూ ముసురుకు జడిటిస్తూ కదులుతున్నాయి.

మందను అదిలిస్తూ మంద తావుకు చేరుకున్నాడు బీరయ్య. అప్పటికి మసక చీకటి పడింది. మసక చీకట్లో చుట్టూ గుచ్చిగుచ్చి చూశాడు. ఎవరూ కనిపించలేదు. కొద్దిసేపు నిమ్మలంగా అనిపించింది. కానీ వెంటనే 'ఎంతసేపు. ఇప్పుడు గాకపోతె జరాగినంక వత్తరు. అబ్బో... యాదిమరుత్తరా! అనుకున్నాడు. ఇనుప జాలీలను ఎత్తి మందను లోపలికి పంపించాడు. నేలంతా తడిగా, బురద బురదగా, గిజగిజగా ఉంది.

అది చంద్రాగౌడు పునాస గుడ్డం. వారం పది రోజులుగా మంద అందులోనే పంటుంది. మంద వెట్టడానిక్కూడా పెద్ద రాద్దాంతం చేసిండ్రు. ఎవడేం ఇచ్చింది లేదుగనీ నా గుడ్డంలో అంటే నా గుడ్డంలో అని బెదిరిచ్చిండ్రు. ఊరికి దగ్గరగా ఉంటుందని అక్కడ మంద తొక్కడానికి ఒప్పుకున్నాడు. కనీసం ఇనుప జాలీలు తేవడానిక్కూడా ఆసర కాలేదు. గుడిసె వేస్తానని వెయ్యలేదు. కొత్త మురిపెంగా రెండు రోజలు కల్లుసీస పంపి మానుకున్నాడు. అయినా నోరెత్తలేదు బీరయ్య.

మేకలు గొర్లు లోపలికెల్లగానే జాలీలను మూశాడు బీరయ్య. లోపల వాయిలి బరిగెలతో అల్లిన గూడుకలు బోర్లేసి ఉన్నాయి. గూడుకల్లో పిల్లలున్నాయి. తల్లి మేకలు గూడుకల చుట్టూ తిరుగుతూ అరుస్తున్నాయి. గొంగడి తీసి ఇనుప తీగెల మీద పరిచి గూడుకల్ని ఎత్తాడు బీరయ్య. ముర్రు పిల్లలు సంటిపిల్లలు పాలకు ఎగబడ్డాయి. మేకలు గొర్ల అరుపులతో మంద గోలగోలగా

ఉంది. గొంగడితో గడ్డమీదికచ్చి మందవైపు తిరిగాడు బీరయ్య. మసక వెలుతురులో చీకటి ముద్దలా గడ్డంపోతు అటూ ఇటూ తిరుగుతోంది. పక్కకు తిరిగిచూస్తే అక్కడక్కడా గొర్ల మందలు. వాటి ఉనికిని తెలుపుతున్నట్టు అరుపులు. కుక్కల మొరుగుడు. ముసురు లేకుంటే మందలకాడ మంటలు లేచేవి. గొల్లలంతా మంచెల్లో ముడుసుకుని కూర్చున్నారు. కొందరు పెట్టె గిన్నెలతో ఊరివైపు వెళ్తున్నారు. కూతలు వేసి ఎవరినో పిలుస్తున్నారు.

ఊరివైపు మరోసారి పారజూశాడు బీరయ్య. లైట్లు వెలుగుతున్నాయి. పొద్దంతా ఎక్కడికెళ్తాయోగానీ మందకుక్కలు రెండూ చీకటి పడేవరకు చేరుకుంటాయి. కాళ్ల దగ్గర కుయ్యి కుయ్యిమంటే తల నిమిరాడు. ఇరువైపులా ముడుచుకు పన్నాయి.

ఏదో గుర్తొచ్చినట్టు వెనక్కి తిరిగి మందలోకి వెళ్లాడు బీరయ్య. మేకల్ని గొర్లను పాపుకుంటూ వెళ్లి గడ్డంపోతు పిల్ల చెవిని అందుకున్నాడు. అది పొగరుగా బుస్సుమంటూ కొమ్ముల్ని ఊపింది. తలతో బీరయ్యను కుమ్మింది. మే....మే... అంటూ తప్పుకోవాలని పెనుగులాడింది.

“ఆగు... నీగత్తర్రాను. నీకు నాశినగాల మత్తది. వాళ్లు వచ్చింర్రంటే బుక్కపెడతరు” అనుకుంటూ బలంగా ముందుకు లాగాడు. అది నాలుగు కాళ్లను నిర్రదొక్కి అడుగు కూడా కదల్లేదు. వెనక్కువచ్చి తోసుకుంటూ గూడుక దగ్గరికెళ్లాడు. గూడు కిందికి నెట్టి బోర్లించాడు. మే...మే... అని అరుస్తూ గూడుకలో బంతిగడుతుంది పోతు. ఒకసారి మంద చుట్టూ తిరిగి చూశాడు బీరయ్య.

ముసురు పట్టిందంటే తోడేలు భయం. ఆడిది మగది జంటగా వస్తయి. అడ్డమచ్చిన జీవాలను కొరికి పారేత్తయి. తడుముకుంటూ గుడిసెలోకి వెళ్లాడు. అందులో మరింత చీకటి.

తెరిచిన పుస్తకాన్ని బోర్లించినట్టు రెండు తడుకల్ని ఒరిగిచ్చి గడ్డి కప్పుకున్నాడు. మంచె వెయ్యిమని చంద్రగౌనికి చెప్పి చెప్పి యాష్టకచ్చి తనే ఈ పని చేసుకున్నాడు. ఎండకు నీడను ఇస్తుందేమోకాని వానను ఆపలేకపోతుంది గుడిసె. బొట్లు బొట్లుగా నీటిచుక్కలు రాలుతనే ఉన్నాయి.

కింద పరిచిన వరిగడ్డి పూర్తిగా నానింది. పురుగూ బుషి. మొన్ననైతే నాగుపామే వచ్చిపన్నది. చూడకుండా గుడిసెలకత్తే గుడిసెత్తు లేచింది. కిస్మత్ మంచిగుండి వెలుగు పూట కాబట్టి సరిపోయింది. ఆనాటి నుండి గుడిసెలకు అడుగు పెట్టాలంటేనే భయం. అయినా తప్పదు.

చేతులతో పునుక్కుంటూ వాసానికి ముడేసిన సద్దిగిన్నెను అందుకున్నాడు బీరయ్య. సైరతోనే మూలకున్న లొట్టిని అందుకుని చెయ్యి కడుక్కున్నాడు.

“ఈ నీళ్లు పాడుగాను. మల్లా ఎవడన్నా ఏమన్న కలిపిండో.... ఏమన్నగానీ... నోట్లె వొయ్యద్దు” అనుకున్నాడు.

తన గుడ్డంలో మంద పెట్టలేదన్న కోపంతో లొట్టిలో తెల్ల తీటేర్ల పొడిని కలిపాడు నాగిరెడ్డి. తెలవక తాగితే మూడు రోజులు బైలువెట్టింది. రాగెట్ల చింతకింద మంద వెట్టినప్పుడు ఎవడో లొట్టిల పెండగలిపి టార్చ్‌లైట్ ఎత్తుకుపోయిండు. సూడక నొట్లె పోసుకుంటే పొద్దంతా కక్కుడే. అదంతా లొట్టికాడికి వచ్చినప్పుడు యాదికి వత్తనే ఉంటది.

పెట్టెగిన్నె విప్పగానే అన్నం పెల్లలు చల్లగా తగిలాయి. చేతుల పొంట చీమలు పారినట్టనిపించి గిన్నెను కండ్ల దగ్గరికి పెట్టి చూశాడు. “థూ... నీయక్క..... ఇది ఏ పగటి యాల్లన కట్టిపోయిందో...

నిండా చీమలే ఉన్నయి'' అనుకున్నాడు. ఎప్పుడైనా మంద తావున చేరగానే ఇంటికి పోయి తిని వచ్చేవాడు. దసర దగ్గరపడ్డాక ఇంటికెళ్లడం మానేశాడు. ఇదే ముచ్చట తవ్వుతరని.

'సంటిపిల్ల తల్లి. పాపం అదేంజేత్తది. చీకట్లయినా సరే పొద్దుగూకి నంకనే తెస్తనంటే నేనే వద్దంటి' అనుకుని గిన్నెలున్న చారు పోసి కస్సర బిస్సర కలిపి బుక్కలు పెట్టాడు. ఎక్కిళ్లచ్చినయి. అయినా నీళ్లు తాగలేదు. ఊర్సుక తిని గుడిసె బయటకచ్చాడు.

ముసురు పడుతనే ఉంది. 'ఇట్ల ముసురు వెడితే తెల్లందాక సావుమర్నమే.... సలికి వణికి సచ్చుడే' అనుకుంటూ గొంగడి కప్పుకుని మందలోకి పోయాడు. ఎప్పుడూ ముడుసుక పన్నట్టుగానే మంద నడుమ ఇనుప జాలిని వంచుకుని ముడుచుకున్నాడు. వానైనా ఎండైనా చలి అయినా పండుడు అక్కడే! గుడిసెల పంటే అలికిడి తొందరగా వినిపించదు. ఏ దొంగనో తోడేలో వస్తే మోసుక పొయ్యేదాక మెలుకువ కాదు.

ఊరికి అడివికి మధ్య మంద. మందలో గొర్రెలా... మేకలా... ముడుచుకుపన్న గొల్ల. అటు అడివి జంతువుల కండ్లు, ఇటు ఊరి దొరల దొంగల కండ్లు మంద మీదనే! తోడేలు తప్పితే దొంగలు. దొంగలు తప్పితే గోండ్రిగాడు. ఇవి తప్పితే అప్పుసప్పులిచ్చి ఆదుకున్న దొరలు! పైగా వచ్చే రోగాలు.

మందను కాపాడుకోవడం అడుగడుగునా కష్టాలతో కుస్తీ పట్టడమే. అందులో ఆరితేరినా బీరయ్యకు ఈ రోజు గడ్డంపోతును ఇవ్వడమనేది కార్జ్యాలను కదిలిస్తుంది. భార్య బాగలేకున్నా, కొడుకు పురుడయినా, బ్యాంకు మేనేజర్ దరువాజలు లావట్టినా.... ఎవరెంత కాయిశు చేసి నూరు ఎక్కువ ఇత్తమన్నా అమ్మలేదు. ఇత్తునానికని ఉంచుకున్న పోతు.

పడుకుని అటూ ఇటూ కదులుతున్నాడు బీరయ్య. మొఖం నిండా కారుతున్న వాన చినుకుల్ని లెక్కచేయకుండా అప్పుడప్పుడూ లేచి ఊరివైపు చూస్తున్నాడు. ఆ రాత్రి తెల్లారకపోతే... తెల్లారి దసర పండుగ కాకపోతె ఎంత బాగుండనుకుంటున్నాడు. ఆ బాధలోనే మనాదిలోనే కన్నంటుకుంది.

మంద తావున ఒక గొప్ప నాగరికథ వర్ధిల్లుతుంది. కొత్త సమాజపు నీతి సూత్రమేదో అక్కడ పురుడు పోసుకుంటుంది. మాయిముంతను చూసినా, మురుగుపిల్లను చూసినా ముర్రుమేకను చూసినా ఎగవడి కొరుక్కుతినే కుక్కలు చెరోపక్కా నిలబడి బాధ్యతగా వాటికే కాపలా కాస్తూ సాధు జంతువులైనాయి. గొర్లు మేకలు జాతి వేరైనా అలవాట్లు వేరైనా ఒక్కచోటనే కలిసి తిరుగుతున్నాయి. లేచి పరుగెత్తలేని సంటిపిల్లలు, నెలలు నిండని మేకలు మందలో సొలుక్కుంటూ తిరుగుతుంటే వాటికి తగిన స్వేచ్ఛనిచ్చి తొక్కకుండా కాపాడే బాధ్యతను అన్ని జీవాలు నెత్తినెత్తుకున్నాయి.

పొద్దంతా బింకంగా తిరిగి పోరిమ్యాకలను, కొదుమ పిల్లల్ని తెగగెదిమిన పోతుపిల్లలు గొల్ల సిరిని పెంచడానికి మాత్రమే జతను కోరినట్టు అంచున నిలబడ్డాయి. మందలో ముడుచుకున్న గొల్లను కాపాడడానికన్నట్టుగా అరగజం దూరంలో దడిగట్టి నిలబడ్డ మేకలు కాలు కదుపకుండా, గొంతు సైతం విప్పకుండా సైర మీద మెదులుతున్నాయి తప్ప నిద్రా భంగం చేయడంలేదు.

తప్పించుకుపోయే అవకాశమున్నా, బయటకు అడుగువేసే దొంగబుద్ధి లేదు. అంతర్లీనమైన నైతిక సూత్రమేదో అక్కడ కాలాన్ని కదుపుతుంటే మంద మెల్లగా నిద్రలోకి జోగుతుంది.

చిన్నగా ఏదో చప్పుడు. ఎవరిదో పిలుపు. ఒక్కసారిగా కుక్కలు 'భౌ' మన్నాయి. మేకపిల్లలు పరుగెందుకుని తల్లులను చేరుకున్నాయి. మంద ఉలిక్కిపడింది. తోడేళ్లు వచ్చాయేమోనని చుట్టూ చూశాడు. తోడేళ్లు కాదు గానీ వాటిలాంటి మనుషులే.... ముగ్గురూ చేతుల్లో చెత్తిరీలతో, టార్చిలైటును మంద చుట్టూ తిప్పుతూ పిలుస్తున్నారు.

బీరయ్య భయపడిందంతా అయింది. "ఆ... వత్తన్న" అంటూ కండ్లు నులుముకుంటూ వెళ్లాడు. వెళ్లద్దు అన్నట్టుగా మేకలు అడ్డుపడుతున్నాయి. అంతవరకు భయంగా అనిపించింది. కానీ ఏదో ధైర్యం వచ్చినట్టయింది బీరయ్యకు.

"ఏమాయెరా... మర్చిపోయినవా... ఇగతెత్తవో అకతెత్తవోనని ఇవారదాక సూత్తిమి. నువ్వు ఇక్కడ మలుసుక పన్నవు నీ ఎట్టిపిల్ల ఏదిరా?" నవ్వుతూ అడిగినా ఆ మాటల్లో గమాండున్నది. గడ్డమీద నిలబడే కోపంగానే అన్నాడు పెద్ద సుంకరి. మిగిలిన వాళ్లలో ఒకడు తలారి. ఇంకొకలు వాడ నెంబరు. మీకు దంగుతడో లేదో నేను వస్త పా... అని వెంటబడి వచ్చాడు నెంబరు.

ముగ్గురి వంక తేరిపారజూశాడు బీరయ్య. "ఏంటిదే.. మాసిపోయిన ఎట్టిపిల్లను మల్ల దెత్తుండ్రు. ఈ నాలుగైదేండ్ల కొద్ది గడిముందు గుమ్మడికాయలు కొడితే ఊరు ఎచ్చుతలేదటనా...." అన్నాడు. అన్నాడేగానీ గట్టిగా అనలేదు. ఒప్పుకునే ముందు వట్టిగ ఊరుకోకుండా రెండు మాటలు అనాలని అన్నట్టుగా అన్నాడు.

"నీయవ్వ... ఏడ్చుకుంట ఇయ్యకురా... నీవంతు ఐదారేండ్ల కొక్కసారి వత్తది. కుషీకొద్దీ ఇయ్యాలెగనీ పిస్కపడుతాండ్రా. అయినా మా ఇంట్లకు ఇత్తలెవ్వు. ఇది కొత్తగ పుట్టలేదు. ఏదో నడుమల నాలుగు రోజులు బందైతే అట్లనే నడుత్తదా...?" అన్నాడు ముందుకు వచ్చి నెంబరు. ముగ్గురి చూపులూ ఆకలిగా మందను తిరుగుతున్నాయి. లైటు వెలుతురులో ఒక్కొక్కదాన్ని చూస్తున్నారు. ఎక్కడా చూపు నిలువలేదు.

మందలోకి వెళ్లి ఒక మేక పిల్లను బూరువట్టి గుంజుకచ్చి "ఇగో... కొండవోండ్రి" అన్నాడు బీరయ్య. అది వాళ్లు మెచ్చరనీ తెలుసు. చూపుకు నచ్చదనీ తెలుసు. ఏమంటారో తెగదగ్గాలని చూపించాడు.

"అగో... గా సొటపిల్ల ఎందుకురో... మనిషికి భాగం వక్కంత రాదు. గడ్డంపోతు ఏదిరా... సర్పంచ్ దాన్నే తెమ్మన్నడు" అన్నారు ముగ్గురూ ఒక్కసారె. "ఒక్కసారన్నా కత్తెర వడ్డాదిరా..." ఈ సారి నెంబరు కోపంగా.

బీరయ్య గుండె జల్లుమంది. ఏమన్నగాని, పోతును ఇచ్చేది లేదు. ఇత్తునం పోతు. అది మందల ఉంటే సగం బలం. చెడి అమ్ముకుంటే నాలుగు వెయిల మాలు అనుకున్నాడు. ఏమీ తెలువనట్టుగా పైకి మాత్రం "ఎక్కడి పోతు. నిన్ననే బ్యారమైపోయె. పక్కిరోళ్ల లగ్గమట. కొనుక్కపో యిండ్రు..."

ఎన్నో ఆశలతో వచ్చినట్టున్నారు. అతడి మాటలు పూర్తిగాకముందే చుర్రుమన్నారు. "ఇగో.. శాప పిల్లలకు ఈతలు నేర్పకు. జెట్టనపట్టియ్యి. పోవాలె." అన్నారు.

గడి ముందు జంబిపిల్లను తలువార్‌తో కొట్టే వంతు సుంకరిది. కోశిపాల్లు వేసే వంతు తలారిది. ఆ ఇద్దరూ ఉన్నారిక్కడ. కొట్టినందుకు, కోసినందుకు, కాళ్లు, తలకాయ, తోలు అర్రల

బొత్త. పేగులు, మాంసం మిగులుతాయి. ఎన్ని పాల్లు, ఎందరికి పంచుడు, ఎన్ని శాతలు, ఎవరు పెద్దమనుషులు లెక్క చూసుకునే లెక్కమంతుడు నెంబరు. మిగిలిన మాంసం ముగ్గురికి సమానం. అందుకే ఎలాగైనా పోతును పట్టుకెళ్లాలని చూస్తున్నారు.

"ఒర్నీయక్క.... అవద్దమాడుతనా... అవ్వతోడయ్యా... నైమానంగ వాళ్లే కొనుక్కుపోయింద్రు. పట్టింద్రంటే ఇడువలేదు. ఆడికి దసురపిల్ల అని చెప్పిన..."

"ఇగ వీనికి ధైర్యం రాదు...". అంటూ ముగ్గురూ మందలకు దిగి చూస్తున్నారు. "నా మాట అబద్దమైతే చూసుకోంద్రి..." అన్నాడు బీరయ్య. ఎవరు గూడ్క దగ్గరికి పోయినా, గూడ్క మీద లైటు పడినా భయం పుడుతుంది. మంద పోశమ్మకు మనసులోనే మొక్కుకున్నాడు.

చిట చిట ముసురు కొడుతనే ఉంది. చెత్తిర్లు ముడిచి గోసులు ఎగగట్టి లైట్లు కొట్టుకుంటా మందంతా తిరుగుతున్నారు. వెలుతురుకు మంద బెదురుతోంది. కుక్కలు మొరగటం ఆపి వెంట తిరుగుతున్నాయి. ముసుర్ల నిలబడి చూస్తున్నాడు బీరయ్య. ఎందుకో కానీ వణుకుతున్నాడు.

"తిరిగి తిరిగి యాష్టకచ్చింది. యాడ దాచినవురా బీరిగా...." కోపంగా అడిగాడు నెంబరు. బీరయ్యకు ధైర్యమచ్చింది. రెండు రోజులు దాస్తే చాలుననుకుని మళ్లీ అదే ముచ్చట చెప్పాడు.

"వారీ.... యాడాదికో దినం ఊరు మీదికి ఇచ్చుడంటే ధైర్యం రాదు. మీ గొర్లు మేకలు ఎక్కడ మేస్తున్నయిరా..? చేన్లు, చెలుకలు, పరంపోగు గుడ్డాలు అన్నీ తిప్పుతరు. యాడ తుమ్మ చెట్టున్నా, యాప చెట్టున్నా కొమ్మలు గొట్టి గొర్లకేత్తరు. ఇప్పుడేమో పెద్దలు సచ్చినంత దుఃఖం. రేపటి నుండి యాడ మేపుతవో సూత్త. ఊరిమీద గడ్డి నీఅవ్వ జాగిరనుకుంటున్నవు..." సుంకరి తిడుతుంటే ముగ్గురు వెనక్కి తిరిగారు.

'నా అవ్వ జాగిరికాదు గనీ నీ అవ్వ జాగీరేమో....' నెంబరు లేకుంటే అనేవాడే! మనసులో పెట్టుకుని ఇంకెంత ఆగం జేస్తడోనని నోరెత్తలేదు. ఉంటే ఇయ్యకపోదునా" అని మాత్రం అన్నాడు. ఏదో నాలుగు మాటలని పట్టుకుపోతారనుకున్నాడు గానీ వాపసు పోతారనుకోలేదు. ఏదో భయం మొదలయింది బీరయ్యకు.

"ఓ పటేలా! నేను ఇయ్యనంటున్ననయ్యా.... నీ బుద్దున్నది తీసుకపో లేని గడ్డంపోతును యాడ నుంచి తేవాలె" అన్నాడు. వాళ్లు వెనక్కి చూడలేదు. చీకట్లో కలిసిపోయారు. గడ్డంపోతును దాచి తప్పు చేశానా అనిపించింది. అంతలోనే... 'ఎవనయ్య సొమ్ము. నాది నేను దాసుకున్న. ఈ గుంజిగాళ్లకు భయపడి నాలుగు వెయిల మాలును నీల్లల్ల ఏసుకుంటనా? ఎవనితోని ఏమైతది మాంటె రేపు ఆఫీసు దగ్గరికి పిలిపిత్తరు. బుద్దున్నది ఏరుకో.... యాడున్నది గడ్డంపోతు? అని అంట. తెల్లారే వరకు గడ్డంపోతును మాయం జేత్తనా లేదా సూడు...' అనుకున్నాడు.

వెంటనే దృఢంగా లేచి నిలబడ్డాడు. తోడేలు వస్తదేమోనని భయమయింది. 'ఎంత సేపట్లో వస్త సూడు....' అనుకుంటూ కుక్కల వీపు తట్టి ఊరివైపు కదిలాడు బీరయ్య.

ఊళ్లోకి చేరగానే అతడి నడక ఫకీర్ కాశీం ఇంటివైపు సాగింది. నిన్ననే మూడు మ్యాకల్ని కొన్నాడు. అడిగిన ధరకు అడిగినంత వాయిదాకు ఇచ్చాడు బీరయ్య. అతడు తప్పక ఒప్పుకుంటాడన్న నమ్మకముంది.

అంత ముసుర్లో.... అదీ రాత్రిపూట వచ్చిన బీరయ్యవైపు వింతగా చూశాడు కాశీం. పెండ్లి

పనుల్లో హడావుడిగా ఉన్నాడు అతను. విషయాన్ని రెండు ముక్కల్లో చెప్పి రెండు రోజులు కాపాడితే చాలన్నాడు బీరయ్య.

"ఉస్కే.... మాకే.... నీ కోడం నాకే పెడ్తావ్ బే... నా ఆగం నాకుంది. నీ పోతు దగ్గర యాడ కావలుండాలె బే.... యాడన్నా తప్పిపోతే నాకే ఉరిపెడతవ్...' అన్నాడు పెడుసుగా.

మందకాడికి వచ్చి అయ్యా... కొడుకా, అని కాలుగదువలు పట్టుకుంటే మంచోడే అనుకున్నాడు గానీ ఇంత కండీషన్ మనిషి అనుకోలేదు. కొద్దిసేపు బతిమాలి, అతడు మారకపోవ డంతో ఆగమాగాన కటికె కిషన్ ఇంటికి పరుగు తీశాడు.

చీకట్లో బురద. కాల్లు జారుతున్నాయి. కయ్యల్లో కూలవడుతున్నాడు. దానికి తోడు వీధిలైట్లు వెలగడం లేదు. అడవిలో పలుచగా అనిపించిన చీకటి ఊళ్లో లైట్ల వెలుతురుకేమో... చిక్కబడింది. ఇవేవీ లెక్క చేయకుండా కిషన్‌ను కలిశాడు. విషయం చెప్పి రెండు రోజులు దాస్తే మర్కపిల్లను తక్కువ ధరకు ఇస్తానన్నాడు.

కిషన్‌కు ముందుగా నవ్వు వచ్చింది. అతడి ఆరాటం చూశాక బాధేసింది. తన అన్నతో బీరయ్యకున్న చనువు,. చచ్చిన మేకలప్పుడు అన్న సంపాదించిన లాభం గుర్తొచ్చాక అందిన కాడికి తను కూడా మోసం చేయాలి అన్న ఆశ పుట్టుకచ్చింది. తెల్లారితే దసరా. ఎక్కడి మేకలు చాలవు. వీడు ఎవడికీ తెలువకుండా తనకు ఇస్తున్నాడు. తెల్లారేసరికల్లా కోసి మాంసం అమ్ముకుంటే సరి. ఇయ్యనేలేదంటే ఎవరేంజేస్తరు? అనుకున్నాడు. వెంటనే కాకుండా కొద్దిసేపు సతాయించి ఒప్పుకున్నాడు.

బీరయ్య అక్కడికే సంతోషపడిపోయాడు. పరుగు పరుగున మందవైపు నడిచాడు. ఊరు దాటే ముందు కాళ్ల ఇంటివైపు మళ్లాయి. తోడేలు భయం గుండెలో కెలుకుతున్నా కొడుకును చూడాలన్న ఆరాటం అటువైపే నడిపించింది. ముసుర్లో వచ్చిన భర్తను చూసి బువ్వకు ఎసరు పెట్టింది కొముర.

"ఇయ్యల్లనైతే ఇంటిమూడు సుట్లు తిరిగింద్రు సుంకరోళ్లు. అక్కడిక్కాడ వచ్చింద్రట గదా.. ఏమన్నరు?" అడిగింది కొముర. ఏడాది కొడుకుని ఎత్తుకుని మంచంలో కూర్చున్నాడు బీరయ్య

"ఎవరు ఏమనుడేంది.. గడ్డంపోతును దాచిన..." అంటూ కథంతా చెప్పాడు గర్వంగా

అంతా విన్నాక భర్తవైపు జాలిగా చూసింది కొముర. "అడివిల తిరిగి చెట్టు చెలక మర్మం దొరికిచ్చుకున్నవు గనీ.... మనుషుల మర్మం దొరికిచ్చుకోలేదు. కిషన్ గాడు సన్నపోడా... వాని అన్నకంటే ఇసపాత్కుడు. అప్పుడే మా అన్నకిత్తవు. నాకు ఇయ్యవా అని మంట మండె" అన్నది అన్నం కలుపుతూ.

అంతవరకూ గుర్తుకు రాలేదుగనీ కిషన్ అన్న కటికె గాలయ్య గుర్తొచ్చాడు. చాలా రోజులనుండి తన దగ్గర గొర్లు మేకలు కొని కోసే వాడు. పోయిన యాడాదే మేకలకు గాలిరోగం తగిలి వరుసగా సచ్చిపోయాయి. సచ్చిన మేకల్ని యాభై నూరుకు. అమ్మమని అడిగాడు గాలయ్య.

"చస్తే పారేస్తగనీ రోగమచ్చిన జీవాలను అమ్మ. ఇది తిన్నవాళ్లు. రోగాలచ్చి సత్తరు" అని ఖచ్చితంగాచెప్పాడు బీరయ్య. మాంసం కోసం కాదని, కేవలం తోలు కొరకే అమ్మమని వత్తిడి

చేశాడు. ఒక్కొక్కటి రెండేసి వెయ్యిల మేకలు. నూరు యాభై పెట్టి తీసుకున్నాడు. తెలియకుండా మాంసాన్ని కూడా కిలోల కొద్దీ అమ్ముకుని వెయిలు సంపాదించాడు. చివరికి ఒకనాడు పురుగులు పడ్డ ఆడిగొర్రె మాంసం తిని నలుగురైదుగురు గావరైతే గాలయ్యను పోలీసులు పట్టుకెళ్లారు.

స్టేషన్‌లో తనకేమీ తెలియదని, బీరయ్య అమ్మితేనే కొన్నానని, గాలి రోగం తెలియనే తెలియదన్నాడు. సచ్చేటివి సావంగ కేసులోంచి బయడపడడానికి బీరయ్యకు అయిదు జీవాలు అమ్ముడయినయి. నలుగురూ నాలుగు మాటలన్నారు. అసలు విషయం చెబితే ఎవరూ నమ్మలేదు.

"ఇప్పుడు ఎట్లంటవే మరి. ఏంజేద్దామంటవు. దాన్ని కండ్లల్ల పెట్టుకుని, కడుపుల దాసుకుని సాదుకున్న. ఇచ్చుడుకు ధైర్యమత్తలేదు...." కొడుకుని గుండెలకు హత్తుకుని ఉన్నాడు బాధగా. ఇంతకు ముందున్న నిమ్మలం లేదు. ఆగమాగమైతుంది. మంద ఏమాయెనో అనిపిస్తుంది. గడ్డంపోతును ఎట్ల కాపాడాలెననిపిస్తుంది. పండుగు పాడుగాను ఎందుకచ్చెననిపిస్తుంది.

"ఏం జెద్దాం. కటికోన్ని గూడా నమ్మి నవ్వుతూ పలకరించే మేక జాతి మనది. రెండు దిక్కుల రెండు తోడేళ్ళు అదిమిపట్టి గుంజితే ఎక్కువ తక్కువ తెగితె ఎక్కడ కొట్లాట మొదలవుతోందోనని చెరిసగం తెగి మురిసిపోయే మేక నీతి మనది. ఇయ్యకపోతే మనను ఉంచుతారు. కులమని... దండుగని, పంచాదని సంపుక తినరు. వీళ్ల కంటే తోడేళ్లు నయం. అడ్డమచ్చినదాన్ని ఎత్తుకుని పోతయి. అదిలిస్తే బెదిరిస్తేనన్న భయపడి పారిపోతయి. వీళ్లు గట్లగాదు. వీళ్ల నుంచి తప్పించుకోవాలంటే ఇగురం గావాలె.... ఇగురం."

ఆమె మాటలు అతడికి ఏవో ఆలోచనలు రేకెత్తించాయి. కొడుకుని దించి నిలబడుతూ, "ఇయ్యక తప్పదంటవా...." అన్నాడు మళ్లీ.

"ఎవల దగ్గర దాచినా... అందరొక్కటైతెరు. కొత్త సర్పంచ్ ఉరుకులాడుతుండు. కారోబార్ కొత్తగచ్చిండు. ఎట్టిపిల్ల అని అడుగుతలేరు. యాటపిల్ల అంటుండ్రు. పేరు ఏదైతేందీ... పిల్లమనదే గదా! పెద్ద మనుషులంత నోరు తెరిచి ఉన్నరు. అప్పట్ల ఎల్లన్నను ఎట్లజేసిండ్రు.... గొర్లకు ఏందో రోగముందని ఎవలూ కొనద్దని జాటించి చెప్పలేదా... ఊర్లె జేత్తే ఊరడమ్మకు సదరు పిల్లను ఇయ్యలేదనే కోపంతోనే గదా...! రేపు మనను గిట్లనేజేత్తరు. డాక్టర్లను తెప్పిచ్చి ఏదో రోగముందని చెప్పిచ్చి ఎవలు కొనకుంట జేత్తరు..." అన్నది అన్నం పంచుతూ. లేచి విసురుగా బయటకు నడిచాడు బీరయ్య. ఊరిలో పగటి సందడి కనిపిస్తోంది. మేకలు గొర్లు పాతమొత్తున్నాయి.

"అయ్యో! బువ్వ తినవా.. బనీను దోతి నానింది. ఇడిచేసి పో.. పప్పుచారు..." తర్వాత మాటలు వినిపించలేదు. గొంగడిని నెత్తిమీద సదురుకుంటూ పరుగు పరుగున మందను చేరుకున్నాడు. కేకపెట్టు దూరంలో ఉండగా గుండె జల్లుమంది.

మంద దగ్గర అలజడి. కుక్కలు మొరుగుతున్నాయి. మేకలు అరుస్తున్నాయి. బీరయ్య గుండె దడదడలాడింది. "వాయ్యో..... తోడేలు వచ్చినట్టుంది. నా నోట్లె మన్నే..... అలికిడి లేకుంటే అన్నిటిని కొరికి పండవెడుతది. షో.... నీగత్తర్రాను. యానంగత్తివే. నీ సత్తెనాశినంగాను..." పరుగు అందుకున్నాడు బీరయ్య.

అసలే ముసురు. దానికి చీకటి తోడు. జర్రన జారింది. ఒడ్డు తట్టింది. ఒక్కబోర్ల పడ్డడు. యాడతాకింది చూసుకోలేదు. లేచి గొంగడి బొంతను అందుకుని పరుగందుకున్నాడు.

మంద దగ్గర తోడేళ్లు కనిపించలేదు కానీ ముగ్గురు మనుషులు కనిపించారు. తలో మూలా కూర్చున్నారు. అప్పటికే మందలో తిరిగిన ఆనవాలుగా జీవాలు బెదురుతున్నాయి. కుక్కల్ని మచ్చిక చేసుకున్నట్టున్నారు. కుయ్యి కుయ్యి మంటున్నాయి. బీరయ్యను చూడగానే ఏదో సంకేతం అందిస్తున్నట్టు పరుగెత్తుకొచ్చి కాళ్లను చుట్టుకున్నాయి.

"కాశీం సాబ్‌కు ఏదో చెప్పినవట గదా.... నువ్వు వచ్చినంక గోసనిపిచ్చిందట. కాపాడుత నన్నడు. కొట్టియ్యమన్నడు" చెవిలో అన్నట్టుగా చెప్పాడు ఖాదర్. కాశీం దోస్తు అతను.

"అరె బీరిగా... సర్పంచ్ కోపానికచ్చిండు. అయిన సంగతి నీకు తెలుసే గదా! యాడవెట్టన్నో గాడనే పెడుతడట. పోతుపిల్ల ఎటూ పోలేదు ఒక వేళ అమ్మితే సరే! అమ్మకుంటే మాత్రం రేపు పొద్దుగల్ల రెండు వసూలు జేత్తనన్నడు. అదే ముచ్చట చెప్పుదామని వచ్చిన. ఉంటే కొట్టియ్యి. లేదంటే రేపు రెండు తప్పవు. నీయిష్టం..." ఇంకోవైపు నుంచి వస్తూ అన్నాడు నెంబర్.... అంటూనే అక్కడ నిలబడకుండా ఊరివైపు నడిచాడు. ఎలాగైనా రెండు జీవాల్ని లాక్కునాలనే ఈ ఉపాయం సర్పంచ్‌కు చెప్పింది అతడే! "ఎలాగూ గడ్డంపోతు రేపు కనిపించకపోదు. వీని నుండి రెండు పోతుల్ని తియ్యకపోనూ" అనుకున్నాడు. గడ్డంపోతు ఎక్కడికీ పోలేదని గొల్లలంతా నమ్మకంగా చెప్పారు అతనికి.

"ఏమ్‌రా బీరిగా.... తెత్తనని పోతివి. ఇక రాకపోతివి, అగ రాకపోతివి. ముసుర్లో అంత దూరం నువ్వేం వస్తవని నేనే వచ్చిన..." అన్నాడు కటికె కిషన్ చేతిలో పగ్గం చూపిస్తూ సైగ చేస్తున్నట్టు మెల్లిగా.

వ్యక్తులు ముగ్గురూ ఒకరికొకరు చెప్పుకోనట్టుంది. చీకట్లో కనిపించలేదు కానీ వాళ్ల కళ్లలో తోడేలు కంటే ఎక్కువ క్రూరత్వం నిండి ఉందనుకున్నాడు. నిజంగానే పిల్లను మాయం చేసి మాకేం తెలువది అని అమాయకంగా మొహం పెట్టేలా ఉన్నారనుకున్నాడు. అది పోనూ మా మీదనే దొంగతనం మోపుతావు అని మీదపడి కొట్టినా కొట్టుతరు అనుకున్నాడు.

లేదని చెప్పమని ఖాదర్‌ను పంపించాడు. "తప్పిపోయింది ఇంకా రాలేదు. కావాలంటే చూడు. ఎప్పుడైనా ఈ పాటికి వచ్చేది. ఊరోల్లే ఎక్కడ దొరుకపట్టుకున్నరో" అని కిషన్‌ను పంపించాడు. అందరూ వెళ్లిపోయాక సాలీడు గూడులోంచి బయటపడ్డ ఈగలా స్వేచ్ఛగా అనిపించింది.

బీరయ్యకు భార్య మాటలు గొర్తొచ్చి ఊరికంటే అడవే నయమనిపించింది. అడవికో నీతుంది. అందులోని జంతువులకూ నియమాలున్నాయి. అక్కడ రక్షణ ఉంది. మందలో తోడేలు పడిన ప్రతీసారి తలనో మొండెమో దొరుకుతయి. దొంగలు పడ్డప్పుడైతే చిన్న బొక్క కనిపించలేదు. అడ్డంబోతే మేకను విడిసిపెట్టి ఏ జంతువైనా పారిపోతుంది. దొంగలు మాత్రం పుర్రెను పలుగ్గొట్టేవారు.

విసవిసా లేచి గూడుక దగ్గరికి వెళ్లి గడ్డం పోతును బయటకు తీశాడు "సత్తివాంటే మరిచిపోత. బతికితివాంటే మందల కలుపుకుంట. తెల్లారి నా మందల కనిపిత్తే నిన్ను చీరుక తింటరు. కోసి దసుర బొట్టు పేరు వెట్టి శాతకింత పంచుతరు...." అంటూ బొండిగలమంటి వాగును దాటించి అడవిలో కలిపేసి వచ్చాడు బీరయ్య ●